





పార్లమెంట్ అభ్యర్థులపై.. నిఘా!

- పార్లమెంట్ అభ్యర్థులూ పారా హుషార్
- ధన ప్రవాహాన్ని అరికట్టేందుకు ఈసీ చర్యలు
- ప్రచారం, ర్యాలీలు, సభల్లో ప్రత్యేక బృందాలు
- అభ్యర్థులకు తెలియకుండానే వీడియో చిత్రీకరణ
- బ్యాంకు, ఏటీఎం లావాదేవీలపైనా కన్ను
- జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో షాడో, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో టీంల ఏర్పాటు

కామారెడ్డి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే విజయవంతంగా పూర్తి చేశారో.. అదే తరహాలో లోక్‌సభ పోరును నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు షాడో బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టేందుకు షాడో పోలీసులు పని చేస్తున్నారు. షాడో పార్టీలుగా నిలిచే పోలీసులు నిత్యం అభ్యర్థుల వెన్నంటే ఉంటారు. ప్రచారానికి సంబంధించి ఖర్చును తక్కువగా చూపిన షాడో బృందాలు ఇచ్చే సమాచారం ఆధారంగా ఎన్నికల అధికారులు లెక్కలు కట్టనున్నారు. ఈసీ నిబంధనల ప్రకారం ఎంపీ అభ్యర్థి ఎన్నికల సంఘం సూచించిన పరిమితిలోపే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా ఖర్చు చేసిన వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది. అదే విధంగా ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నిబంధనలకు మించి ఖర్చు పెట్టినట్లు తేలితే వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అనుచరుల కదలికలపై కూడా..

షాడో బృందాలు ప్రధానంగా ప్రచార ఖర్చులపై నిఘా పెడతాయి. వివిధ పార్టీల ర్యాలీలు, సభల నిర్వహణను షాడో బృందాలు చిత్రీకరిస్తాయి. వాహనాల సంఖ్య, బ్యానర్లు, ఫ్లెక్సీలతో పాటు ప్రచార సామగ్రి వంటి వివరాలు, ఫొటోలను వెంటవెంటనే ఉన్నతాధికారులకు అందజేస్తాయి. అభ్యర్థులకు తెలియకుండానే ఈ బృందాలు పనికానిచ్చేస్తాయి. అంతేకాకుండా.. సమస్యాత్మకమైన అభ్యర్థులు, వారి అనుచరుల కదలికలను ఎప్పటి కప్పుడు గమనిస్తూ వీడియో రికార్డు చేస్తాయి. ఆయా వ్యక్తులు ఎప్పుడు.. ఎక్కడకు వెళ్తున్నది.. ఎవరితో మాట్లాడుతున్నది వంటి వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేస్తాయి.

ఏడు నియోజకవర్గాల్లోనూ..

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రత్యేక షాడో బృందాలను కేటాయించారు. ఈ పార్లమెంట్ స్థానంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, ఆందోల్, సంగారెడ్డి, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక నియోజకవర్గానికి మూడు ఎస్ఎస్‌టీ(షాడో స్పెషల్ టీం) బృందాలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల చొప్పున నియమించనున్నారు. ఒక్కో ఎస్ఎస్‌టీ బృందంలో సహాయ వ్యయ పరిశీలకుడు, ఆదాయపు పన్నుశాఖ అధికారి, పోలీసు అధికారితో పాటు రెవెన్యూ అధికారి ఉండనున్నారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా.. బెదరింపులకు పాల్పడకుండా ఇలాంటి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపైనా నజర్

బ్యాంక్ లావాదేవీలపైనా ఎన్నికల అధికారులు నజర్ వేశారు. ప్రధానంగా ఆన్‌లైన్ ద్వారా జరిగే లావాదేవీలపై కన్నేశారు. ఈ మేరకు జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని సంబంధిత అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు. ఏకకాలంలో ఎక్కువ మందికి ఒకే ఖాతా నుంచి లావాదేవీలు జరిగినా.. ఒకేరోజు ఎక్కువ మొత్తంలో నగదు విత్‌డ్రా చేసుకున్న.. జిల్లా ఎన్నికల అధికారి, ఆదాయపు పన్ను, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలపై ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలని.. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ప్రతి రోజూ లావాదేవీల వివరాలు అందజేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏటీఎంలలో నగదు పెట్టేందుకు తీసుకెళ్లే వాహనాలపై కూడా నిఘా పెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ప్రచార ఖర్చుల వివరాలను రాసేందుకు అభ్యర్థులకు ఈసీ రూపొందించిన ప్రత్యేక నోట్ బుక్‌ను అందజేయనున్నారు. ఇందులో రోజువారి ఖర్చు బ్యాంక్ లావాదేవీలతో పాటు పలు వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది.





ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

కామారెడ్డి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 26: పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ, నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఏర్పాటు చేస్తున్న 913 పోలింగ్ కేంద్రాలకు గాను ఎన్నికల కమిషన్ రూపొందించిన ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా 20 శాతం అదనంగా ప్రిసెడింగ్, సమాయ ప్రిసైడింగ్ ఇద్దరు పోలింగ్ సిబ్బందితో 1093 బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. కార్యక్రమంలో రాజారాం, వరదారెడ్డి, రవి, శ్రీకాంత్, ఏవో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

18 నామినేషన్‌ల తిరస్కరణ

18 నామినేషన్‌లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ కాంత్రి వల్లూర్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు స్వీకరించిన నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా 40 మంది అభ్యర్థులు 68 సెట్లు వివిధ పార్టీల అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించామన్నారు. ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకారం శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్‌జీ తివారి సమక్షంలో నిర్వహించిన అభ్యర్థుల నామినేషన్‌ల పరిశీలనలో 14 మంది అభ్యర్థులు, 18 నామినేషన్‌లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్, అభ్యర్థులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్, ఏప్రిల్ 26: చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సదాశివనగర్ మండలంలోని దగ్గి వద్ద పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున మద్యం, డబ్బులు సరఫరా చేయకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంతోష్‌కుమార్, రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డిలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

అకాల వర్షాల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 26: అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యంపై తప్పకుండా టార్పాలిన్‌లను కప్పుకోవాలని రైతులకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి మండలంలోని లింగాయిపల్లి, చిన్నమల్లారెడ్డి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీంచారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు సరిపడా టార్పాలీన్లను అందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ వసతి కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున బాబు, ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని పొందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 290 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 17,810 మంది రైతుల వద్ద 1,09,489 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున బాబు, ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు మోతీలాల్ షెటే

ఎన్నికల వ్యయ పరిశీలనను పారదర్శకంగా చేపట్టాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు మోతీలాల్ షెటే

కామారెడ్డి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 26: ఎన్నికల వ్యయ పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు మోతీలాల్ షెటే అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు అభ్యర్థుల వ్యయ నిర్వహణ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాస్టికల్ సర్వే లైన్స్ బృందాల పనితీరు, అక్రమ డబ్బు, మద్యం స్వాధీనం కేసులు తదితర అంశాలపై కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ సింధూశర్మలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చును అకౌంటింగ్ బృందం పక్కాగా నిర్వహించాలన్నారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి ఎలా లెక్కించాలి రిజిష్టర్‌లలో ఎలా నమోదు చేయాలో అకౌంటింగ్ బృందంకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీడియో, సర్వేలైన్స్ బృందం ఇచ్చే వీడియో పుటేజీ ఎవిడెన్స్ ఆధారంగా ఖర్చులను లెక్కించి జగ్రాత్తగా అభ్యర్థి షాడో రిజిస్టార్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టార్టికల్ సర్వేలైన్స్ బృందం ఎంసీఎంసీ తదితర అన్ని కమిటీల నుంచి సమాచారాన్ని సేకరించి వాటి ఆధారంగా ఖర్చును లెక్కిస్తూ రోజు వారి నివేదికలు సమర్పించాలని సూచించారు. అభ్యర్థి ఖర్చు రిజిష్టర్‌తో సరిపోల్చుకోవాలన్నారు. అకౌంటింగ్ నిర్వహణలో అనుమానాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. రూ.10 లక్షలకు పైగా జరిగే అనుమానాస్పద బ్యాంక్ లావాదేవీలు, బహుమతుల తరలింపుపై నిఘా ఉంచాలన్నారు. కంట్రోల్ రూం, మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రాల్లో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. నిఘాకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ టీంలను కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించాలన్నారు. సి-విజిల్, 1950 టోల్‌ఫ్రీ ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మీడియా మానిటారింగ్ కమిటీ ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారంపై పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రచారానికి ప్రకటనలు పేయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా చూపాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు వివిధ బృందాలు పోలీస్ శాఖ ద్వారా 72 మంది నుంచి రూ. 1కోటి 38 లక్షల 68 వేల నగదును పట్టుకుని సరైన పత్రాలు చూయించిన 57 మందికి రూ. 72 లక్షలు తిరిగి అందజేశామని రూ. 53 లక్షల నగదుపై ఆదాయపు పన్ను శాఖ వారికి అప్పగించామన్నారు. ఆదేవిధంగా పోలీస్, అబ్కారీ శాఖలు సంయుక్తంగా రూ. 55 లక్షల 57 వేల విలువ గల 40 వేల 123 లీటర్ల మద్యాన్ని 40 వేల విలువ గల 143 కిలోల గంజాయి వంటి మత్తు పదార్థాలను పట్టుకున్నామని వ్యయ పరిశీలకులకు తెలిపారు. జిల్లాలో 913 పోలింగ్ కేంద్రాలకుగాను 64 సమస్యాత్మక లోకేషన్‌లు 183 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. 516 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నామన్నారు. వ్యయ నిర్వహణకు వ్యయ పరిశీలకులతో పాటు 34 అకౌంటింగ్ బృందాలు వీడియో విననింగ్, వీడియో సర్వేలైన్స్ ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను 94 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తుండటంతో పాటు 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నామని మోతీలాల్‌షెటే వివరించారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ రెండు అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులపై గట్టి నిఘా పెట్టామని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో తగు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఆయుధ లైసెన్స్‌లు కలిగిన 25 మంది పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేశారని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఒకరిపై కేసు నమోదు చేశామని, అక్రమ డబ్బు మద్యంపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైని ఎస్పీ కాజల్, అధికారులు రవీంద్రరాజు, అంబాజీ, మనోజ్ కుమార్, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.



సౌత్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ

సౌత్ క్యాంపస్‌లో మహనీయుల జయంతి ఉత్సవాలు

భిక్కనూరు, ఏప్రిల్ 26: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో శుక్రవారం మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు ప్రొఫెసర్లు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలో అట్టడుగు వర్గాల, దేశ అభ్యున్నతికి వారు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. దేశానికి వారు అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఎంతో గొప్పవని, వాటిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, అధ్యాపకుడు మోహన్‌బాబు, యాలాద్రి హరిత, సబిత, లలిత, ప్రతిజ్ఞ, సునీత, వైశాలీ, నారాయణ, నిరంజన్, ఇంద్రకరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కాచాపూర్ చెరువులో మట్టిని తవ్వుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ఉపాధి కూలీలు కొలతల ప్రకారమే పనులు చేపట్టాలి

- ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, ఏప్రిల్ 26: ఉపాధి కూలీలు కొలతల ప్రకారమే పనులు చేపట్టాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కాచాపూర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం త్వరగా రావాలని, ఉపాధి హామీ పనుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాగా కాసేపు ఉపాధి కూలీలతో కలిసి చెరువులో మట్టి తవ్వి కూలీలను ఉత్సాహ పరిచారు. తాను రైతుబిడ్డనే అని ఇలాంటి పనులు తనకు అలవాటే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాధిక, టీఏ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

● మండల ప్రత్యేక అధికారిణి సుష్మ

బిక్కనూరు, ఏప్రిల్ 26: మండలంలోని బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి సుష్మ అన్నారు. శుక్రవారం బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి మాట్లాడుతూ బాగిర్తిపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2లక్షల అంచనాతో పైప్‌లైన్ వేయ్యడం జరుగుతుందన్నారు. మండలంలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో రాధిక, గ్రామపంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం



● రాజంపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశం

'ఎండలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలి'

రాజంపేట, ఏప్రిల్ 26: మండలకేంద్రంతో పాటుగా శేర్‌శంకర్ తండా గ్రామాలలో శుక్రవారం ఉపాధి పనులను ఎంపీడీవో రాజేశం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున్న కూలీలు జాగ్రత్తలు పాటించాలని, ఉదయం 6:30 గంటల నుంచి 10:30 గంటల వరకు పనులు కొనసాగించాలని సూచించారు. ఇందులో టీఏ బాస్కర్, పంచాయితీ కార్యదర్శి అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

పోటీ పరీక్షల్లో పాల్గొని సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి: సీఐ

సిరికొండ, ఏప్రిల్ 26: పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలో పాల్గొని ప్రతిభ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని ధర్పల్లి సీఐ భిక్షపతి విద్యార్థులకు సూచించారు. అకాడమీ, ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ అప్టిట్యూడ్ టెస్టు-2023 ఒలంపియాడ్‌లో పాల్గొని రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచిన దీక్షిత్, కృతిక, అద్వైత్‌రెడ్డి, విష్ణు, రిషిత్‌లను సీఐ అభినందించి మెమొంటోలను అందజేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యాభ్యాసం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువడంతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. విద్యార్థులవెంట ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి ఉన్నారు.

ఎంఎల్‌బీ కప్ బేస్‌బాల్ క్రీడాపోటీల్లో చీమన్‌పల్లి విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఏప్రిల్ 26: అంతర్‌రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎంఎల్‌బీ కప్ బేస్‌బాల్ క్రీడాపోటీల్లో సిరికొండలోని చీమన్‌పల్లి హైస్కూల్ విద్యార్థుల ద్వితీయస్థానంలో నిలిచారు. ఈనెల 23 నుంచి రెండు రోజులపాటు ఉస్మానియా యూనివర్శిటీ క్రీడామైదానంలో హైదరాబాద్ (తెలంగాణ-ఆంధ్రప్రదేశ్) రీజియన్ 12వ చాంపియన్‌షిప్ ఎంఎల్‌బీ కప్ ఫైనల్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీమన్‌పల్లి జట్టు సిరికొండ సత్యశోధక్ జట్టుతో తలపడి రెండోస్థానంలో నిలిచింది. ద్వితీయ బహుమతిని అందుకున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సాఫ్ట్‌బాల్ ఇండియా కోచ్ డాక్టర్ కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ పరీక్షలు 4వ రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం 1వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 355 పరీక్షలకు హాజరుకావాల్సిన 331 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

రుద్రూరు, ఏప్రిల్26: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్‌లను అమర్చుకోవాలని రుద్రూరు ఎస్సై అప్పారావు తెలిపారు. శుక్రవారం రుద్రూరులో వాహనాలను తనిఖీ నిర్వహించి నెంబర్ ప్లేట్‌లేని వాహనాలకు, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించడం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి అమ్మేవారు, తాగే వారి గురించి తెలిసిన వెంటనే సమాచారం అందించాలని ఎస్సై కోరారు. వివరాలు తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఆధారాలున్నా.. నగదు స్వాధీనం!

● సామాన్యులకే కోడ్ కష్టాలు ● ఎన్నికల వేళ భారీగా పట్టుబడుతున్న నగదు, బంగారం ● పట్టుబడుతున్న డబ్బుంతా సామాన్యులదే! ● టార్గెట్ల కోసం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అత్యుత్సాహం
● ఆధారాలున్నా వదలని వైనం ● తమ నగదు కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు ● నిజనిర్ధారణ కమిటీ పరిశీలన తర్వాతే చేతికి..

ఖిల్లా, ఏప్రిల్ 26: ఎన్నికలలో ప్రలోభాలకు తావివ్వకుండా.. నగదు, బంగారం రవాణాను అడ్డుకట్ట వేసి.. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటుచేస్తున్న చెక్‌పోస్టులు, తనిఖీ కేంద్రాల్లో సామాన్యుల నగదు, బంగారుఆభరణాలు స్వాధీనం చేసుకుంటున్నారు. 50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తున్న నగదును గుర్తించిన డబ్బును స్వాధీనం చేసుకుంటున్నారు. వాటికి ఆధారాలు చూపినా సరైన ఆధారాలు లేవంటూ స్వాధీనం చేసుకున్న నగదును ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపించేస్తున్నారు. తమ నగదు కోసం బాధితులు కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అనేక అవస్థలు పడుతున్నారు.



● టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అత్యుత్సాహం

పట్టుబడిన నగదు, ఆభరణాలకు తగు ఆధారాలు చూపిన వారికి ఆ డబ్బును అక్కడే ఇచ్చేయాలని కలెక్టర్ పోలీసులకు ఆదేశాలు జారీచేసినా పోలీసుశాఖలో ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మాత్రం తమ టార్గెట్ల కోసం ఒక అడుగు ముందుకేసి అత్యుత్సాహన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలోని పలు బ్యాంకుల వద్ద మాటు వేసి అమాయకంగా కనిపించిన వారిని గుర్తించి వారి వాహనాలను తనిఖీ చేసి డబ్బు కనిపించగానే స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ డబ్బుకు సంబంధించిన బ్యాంకు వారు ఇచ్చిన లెటర్ చూపిన ససెమిరా అంటూ వారిని బెదిరించి మరీ పోలీసులకు అప్పగిస్తున్నారు. రెండురోజులుగా జిల్లావ్యాప్తంగా మొత్తం 17మంది వద్ద డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారుల వద్ద రికార్డులు ఉన్నాయి. అయితే వీరు పట్టుకున్న నగదు అంతా సామాన్య ప్రజానీకం ఉండడం గమనార్హం. తాను ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.3లక్షలకు సదరు వ్యక్తి ఆధారాలు చూపినా పోలీసులు మాత్రం వినిపించుకోక ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గత గురువారం నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌కు చెందిన కమీషన్ ఏజెంట్ రూ.9లక్షల 90వేలను బ్యాంకు నుంచి డ్రా చేసుకుని తన ద్విచక్రవాహనంలో పెట్టుకుంటుంటే అక్కడే మాటు వేసి ఉన్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆయన వద్దనుంచి ఆ డబ్బును స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఆ డబ్బుకు సదరు వ్యక్తి ఆధారాలు చూపినా ఇవ్వకుండా అధికారులకు ముట్టచెప్పాడు. దీంతో సదరు కమీషన్ ఏజెంట్ రైతులకు చెల్లించాల్సిన డబ్బు కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని ఆధారాలు చూపినా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఉండడంతో ఆ వ్యక్తి ఆ నగదు కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● త్రిసభ్య కమిటీ పరిశీలించిన తర్వాతే..

పోలీసులు పట్టుకుని జిల్లా ఖజానా కార్యాలయంలో జమ చేసిన డబ్బులకు ఆధారాలు చూపినా సకాలంలో రావడంలేదు. ఆ డబ్బు పొందాలంటే ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ పరిశీలించిన అనంతరం డబ్బు పొందడానికి అవకాశం ఉంటుంది. అయితే ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులే కమిటీ సభ్యులుగా ఉండడంతో వారు సకాలంలో రావడం లేదని, వచ్చినా అన్నీ పరిశీలించి డబ్బు ఇవ్వడానికి రెండు నుంచి మూడు రోజులు పడ్తుందని బాధితులు తెలిపారు.

● ఎన్నికల డబ్బును పట్టుకోని పోలీసులు

ఎన్నికలలో ప్రలోభాల కోసం కొందరు నాయకులు వెచ్చిస్తున్న డబ్బును మాత్రం పోలీసులు ముట్టుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందస్తుగానే వారికి సమాచారం ఉండడంతో వారు నాయకుల వాహనాలను చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల టార్గెట్ కోసమే వారు సామాన్యుల డబ్బును పట్టుకుంటున్నట్లు తెలిసింది.

ఆధారాలుంటే నగదు ఇచ్చేయాలని సూచిస్తున్నాం..

● రాజవెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

పోలీసుల తనిఖీల్లో తమ సిబ్బంది పట్టుకున్న డబ్బులకు సరైన ఆధారాలు చూపించిన వారికి అక్కడే సంతకాలు, పూర్తి వివరాలు తీసుకొని డబ్బులు ఇచ్చేయాలని సూచిస్తున్నాం. అనవసరంగా ప్రజలకు ఇబ్బంది పెట్టొద్దనే ఆదేశిస్తున్నాం.



బోధన్‌లో శివనామ సప్తాహ దృశ్యం

దేశ సంస్కృతిని ప్రతీఒక్కరు ఆచరించాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: దేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలని బెల్‌మొగ్రా పీఠాధిపతులు శ్రీ బ్రహ్మసిద్ధ దాయల్ శివాచార్య స్వామిజీ అన్నారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో శుక్రవారం 7వ రోజు శివనామ సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజల అనంతరం భక్తులు భజనలు, కీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని ఆయన సూచించారు. సృష్టిలో సమస్త జీవరాశుల్లో మానవ జన్మ చాలా శ్రేష్టమైనదని సూచించారు. ప్రజలు నిత్యం శివనామ స్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు అజయ్ వడియర్, పురాణే అజయ్ కుమార్, శంకరప్ప, విఠలప్ప, శివకుమార్, పురాణే దిలీప్ కుమార్, సిద్ధిలింగాయప్ప, గణపతి అప్ప, నాగనాథ్ పటేల్, వీరశైవ భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం సెంటర్ ఫర్ వరల్డ్ సొలిడెరిటీ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని మందర్నా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌జీవోస్ స్వచ్ఛంధ సంస్థ పేద విద్యార్థుల భవిష్యత్ కోసం 4లక్షల విలువ గల డిజిటల్ మానిటర్ స్మార్ట్ టీవీని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సురేఖ, ఉపాధ్యాయులు శైలజ, గ్రామ పెద్దలు మందర్నా రవి, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

మోస్రా, ఏప్రిల్ 26: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో గల అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం జిల్లా జైలర్ రాజశేఖర్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తనవంతు సహాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనాథ వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతకుంట మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బస్టాండ్‌లో డ్రైనేజీ పనులు చేపడుతున్న దృశ్యం

ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 26: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. బస్టాండ్ లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన 'ఇదీ ఆర్టీసీ బస్టాండేనా?' కథనానికి ఆర్టీసీ మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. చాలా ఏళ్లుగా డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహించి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మురికి కాల్వ సైతం బస్టాండ్‌లోకి రావడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. దీంతో మున్సిపల్ అధికారులు మెయిన్‌రోడ్డు నుంచి బస్టాండ్ ఇన్‌గేట్, ఔట్ గేట్ వరకు జేసీబీతో కాలువ తవ్వి డ్రైనేజీని నిర్మిస్తున్నారు.

బాల్కొండలో వ్యక్తిత్వ వికాస శిబిరం

ముప్కాల్, ఏప్రిల్26: బాల్కొండ మండల కేంద్రంలోని కిసాన్‌నగర్ గ్రామంలో భగవన్ శ్రీ సత్యనంద మహర్షి తీర్థ భక్తజన ఆశ్రమంలో మే 1నుంచి 7వ తేదీ వరకు ఎనిమిదేళ్ల నుంచి 15ఏళ్ళ బాలబాలికకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ శిబిరం ఉంటుందని ఆశ్రమ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు భగవద్గీత, నిత్యప్రార్థన, శ్లోకాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. నైతిక విలువలు కూడిన కథనాలు, ఆటపాటలతో పాటు పుణ్యక్షేత్ర దర్శనం చేయించనున్నట్లు తెలిపారు. వారంరోజులు ఆశ్రమంలోనే పరిశీలిస్తారని, ఆసక్తిగల తల్లిదండ్రులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకొని, ముందుగా వచ్చే వారికే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థి

కోటగిరి, ఏప్రిల్ 26: కోటగిరిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి వివేక్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మొబీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటగిరి కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థి జేఈఈలో మెయిన్స్ పూర్తిచేసి అడ్వాన్స్‌కు అర్హత సాధించాడని పేర్కొన్నారు. విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి తాగుతున్న యువకులు

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 26: భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామశివారులోని నిర్మానుష ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం గుట్టుచప్పుడు కాకుండా చెట్లపొదల్లో గంజాయి తాగుతున్న యువకులను భీమ్‌గల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు ఎస్సై హరిబాబు వెల్లడించారు.



బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్‌యాదగిరి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● టీయూ రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి రిజిస్ట్రార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ఆర్మూర్ ఎంపీపీ పస్కు నర్సయ్య ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకృష్ణ, టూటా అధ్యక్షుడు పున్నయ్య, కాంట్రాక్టు అధ్యాపకుడు దత్తహరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నేతా, ఎన్ఎస్‌యూఐ నాయకులు సాగర్, రాజేందర్,మహేశ్, శ్రీకాంత్, నవీన్, కృష్ణ కుమార్, రాజు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26: ఈనెల 20న అర్ధరాత్రి బైకుపై ఇంటికి వెళ్తుండగా హైటెక్ వెంచర్ వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన నడిపల్లి తండాకు చెందిన బట్టు సతీశ్, బట్టు సురేశ్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో పరిస్థితి విషమించి బట్టు సతీశ్ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

'రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలి'



నవీపేట బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవీపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో రైతులకు సంబంధించిన రూ.2లక్షల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.2లక్షల రుణమాఫీతోపాటు ఎకరాకు రూ.15వేలచొప్పున రైతుబంధు ఇవ్వాలని, వరి పంటకు మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ప్రతీ బూత్ నుంచి కనీసం 10 మంది చొప్పున నవీపేట మండలం నుంచి 1200మంది సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగరావు, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, అల్లం రమేష్, సూరి బాబు, గంగాధర్, మొహిజ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో చండీయాగం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, లోక కల్యాణం కోసమే చండీయాగం, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయసాయి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాల ప్రాంగణంలో సహస్ర లింగార్చన, యజ్ఞం, చండీయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేసి 20ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఆర్ చక్రవర్తి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న పురోహితులు

ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్26: వేసవికాలం ముగిసేవరకు అన్నిగ్రామాల్లో ఉపాధిహామీ కూలీలందరికీ తప్పనిసరిగా పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండలపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి 15వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో వేసవికాలం ముగిసేవరకు ప్రతీఒక్కరికి ఉపాధిహామీ పనులు కల్పించాలని, ఈ వేసవికాలం అయినందున పనులు చేసే చోట టెంట్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వేసవికాలం అయినందున ఎక్కువ మంది కూలీలు పనికి వచ్చే విధంగా చూడాలన్నారు. అనంతరం ఈ ఏడాదిలో గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు వివిధ పనులు చేయగా ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి హామీ అధికారులు గ్రామాల వారీగా వివరాలు చదివి వినిపించారు. వివిధ గ్రామాల్లో రోడ్ల నిర్మాణంలో హరితహారం చెట్లు తొలగించగా, వేసవికాలం మొక్కలు ఎండిపోయినందున వచ్చే వర్షాకాలంలో కొత్తగా మొక్కలు నాటాలని ఆయన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వివిధ గ్రామాల్లో కూలీలు ఉపాధి హామీ పనులు చేయగా వారి హాజరుపట్టిక సరిగ్గా పడలేదని వాటిని సరి చేయాలని సూచించారు. రానున్న హరితహారం కార్యక్రమంలో వర్షకాలంలో మొక్కలు నాటి లక్ష్యానిన దాటలని అన్నారు. సమావేశంలో డీపీవో నారాయణ, అప్పర్‌మెంట్ శ్రీనివాస్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎస్ఆర్‌పీ పాండు, ఏపీవో రవి, గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్



బీర్కూర్‌లో ఎల్లమ్మ నాటక ప్రదర్శన దృశ్యం

బీర్కూర్‌లో ఎల్లమ్మ నాటక ప్రదర్శన

బీర్కూర్, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రేణుకా ఎల్లమ్మ నాటక ప్రదర్శన ఇచ్చారు. వేషాలు కట్టి అమ్మ వారి జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. గత మూడు రోజులుగా ఈ ప్రదర్శన కొనసాగుతుంది. శుక్రవారం నాటితో ప్రదర్శన ముగిసింది. ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆట, పాట, మాటలతో ప్రదర్శన రసవత్తరంగా కొనసాగింది. ప్రదర్శన కారులకు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు.



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో బారెడు పోచమ్మ పండుగ

మద్నూర్, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో గ్రామస్థులు బారెడు పోచమ్మ పండుగను సామూహికంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి భక్తులు బాజా భజంత్రీలతో, బోనాలతో ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతీ ఏడాది ఆనవాయితీగా నిర్వహిస్తున్న బారెడు పోచమ్మ పండుగను సామూహికంగా జరుపుకున్నారు. గ్రామస్థులు ఆలయం వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం వన భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎడ్ల బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు.



సప్తాహలో పాల్గొన్న భక్తులు

మొగాలో సప్తాహ కార్యక్రమం

మద్నూర్, ఏప్రిల్ 26: మండలంలోని మొగా గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సప్తాహలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సప్తాహాలు, భజనలు నిర్వహించడం వల్లనే సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, ధర్మం వైపు నడుస్తున్నామన్నారు.



పిట్లంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో

జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పిట్లం, ఏప్రిల్ 26: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిషన్ అన్నారు. శుక్రవారం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జొన్నలు క్వింటాలుకు రూ.3180 గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందని, రైతులు పండించిన జొన్నలు దళారులకు తక్కువ రేటుకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌రెడ్డి, ఏఈవోలు లావణ్య, వీణ రైతులు పాల్గొన్నారు.

తాడ్కోల్ రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

బాన్సువాడ, ఏప్రిల్ 26: మండలంలోని తాడ్కోల్ గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర రైస్‌మిల్లులో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్టోర్ రూంలో సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి విచ్చేసి మంటలను అదుపు చేశారు. ఆస్తి, ప్రాణ నష్టం ఏమి జరగకపోవగంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ సీఐ కృష్ణ సంఘటనా స్థలానికి విచ్చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రవీందర్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 26: కామారెడ్డిలో గంజాయి సప్లయ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆబారీ సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం శ్రీ ఆంజనేయ టీ పాయింట్ వద్ద దాడులు నిర్వహించగా 7 ప్యాకెట్ల గంజాయి లభించిందని తెలిపారు. గంజాయి కలిగి ఉన్న కదారి స్వామిపై కేసు నమోదు చేసి 70 గ్రాముల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఎంక్వయిరీలో కదారి స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న ఫరీదాబేగం దగ్గర గంజాయి కొనుగోలు చేశామని తెలిపాడు. దీంతో కామారెడ్డి అబ్కారీ ఎస్‌హెచ్‌వో తన సిబ్బందితో కలసి నిజామాబాద్‌లో దాడులు నిర్వహించగా ఆటోనగర్‌లో ఉన్నటువంటి ఫరీదాబేగం వద్ద 3.48 కిలోల గంజాయి లభించిందని ఆమె వద్ద ఉన్న గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఏఈఎస్ హనుమంత్‌రావు, విజయ్ కుమార్, ఎస్సై విక్రమ్ కుమార్, సిబ్బంది భాస్కర్, మైసారాజు, సిద్ధిరాములు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో పాల్గొన్న మహిళాయోధురాళ్లు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 26: బేతాళ స్వామి జాతర సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన కుస్తీ పోటీలు పలువురిని ఎంతగానో అలరించాయి. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన మల్లయోధులు కుస్తీమే సవాల్ అంటూ పోటాపోటీగా తలపడ్డారు. కొబ్బరికాయ నుంచి మొదలైన కుస్తీ పోటీలు రూ.50, 100, 200, 500, 1000, ఆరు వెండి కడియాలు, రూ.2000 , రూ.5000, రూ.11000ల వరకు కుస్తీ పోటీలు జరిగాయి. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు చత్తీస్‌ఘడ్ నుంచి మౌనిక, వరంగల్ నుంచి రమ్యలు విచ్చేశారు. వెండి కడియం కుస్తీ పోటీల్లో పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. ఈ పోటీలను మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకులు , కార్యకర్తలతో కలిసి తిలకించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, సొసైటీ చైర్మెన్ ఏర్వల కృష్ణారెడ్డి, గ్రామపెద్దలు గడిరెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, జాతర కమిటీ సభ్యులు తదితరులున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం కళాశాల ప్రారంభమయ్యేనా?

నిజాంసాగర్, ఏప్రిల్ 26: నిజాంసాగర్ మండల కేంద్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు అధికార యంత్రాంగం గత ఆగస్టు మాసంలో హుటాహుటిన అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించారు. కనీసం 10 మంది కూడా అడ్మిషన్ తీసుకోలేదు. 40 మంది పిట్లంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులను నిజాంసాగర్ కాలేజీలో చేర్చారు. అయితే కళాశాలలో బోధన సిబ్బంది, విద్యార్థుల ఊసే లేకుండా పోయింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నూతనంగా నిర్మాణం చేపట్టిన తరగతి గదుల్లో కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాల నిర్వహణ పిట్లం జూనియర్ కళాశాల ప్రధానాచార్యులకు అప్పగించారు. బోధన, బోధ నేతర సిబ్బందిని కూడా నియమించలేదు. పేరుకే నిజాంసాగర్‌లో జూనియర్ కళాశాలగా ఉంది. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ తదితర గ్రూపులలో విద్యాభ్యాసం కొనసాగనుంది. కానీ వచ్చే విద్యా సంవత్సరం ఈ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందినినియమించి, గ్రూపుల్లో అడ్మిషన్లు తీసుకునేరా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కళాశాల నిజాంసాగర్ మండలంలో కొనసాగితే మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే 10వ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు వీలు కలుగుతుంది. ఈ కళాశాలనిజాంసాగర్ మండల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభమైతే 7 ఉన్నత పాఠశాలల విద్యార్థుల విద్య కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాలను విద్యా సంవత్సరంలో పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పాఠశాల అదనపు గదులు ఇవే..

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

సదాశివనగర్, ఏప్రిల్ 26: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన సదాశినగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కంచర్ల అఖిలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో అఖిల తీవ్ర అనారోగ్యానికి గురైతే ఎమ్మెల్సీ కవితా సహకారంతో రూ.10లక్షలు అందజేసి వైద్యం అందించడం జరిగిందని, ఆరోగ్యం కుదుటపడి బాగా చదివి రాష్ట్రస్థాయిలో బైపీసీ విభాగంలో మూడవ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అఖిలకు ఎల్లప్పుడు తాము అండగా ఉంటామని, మున్ముందు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ నర్సింలు, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, నాయకులు సాయాగౌడ్, రమేష్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి అఖిలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ

ఎన్నికల నిబంధనలను అందరూ పాటించాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఏప్రిల్ 26: ప్రజలు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహనదారులు తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు విరుద్ధంగా ఆధారాలు లేకుండా 50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎన్నికలు అయ్యేంత వరకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రతీఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ కోలా నరేష్‌లతో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుళ్లిన కూరగాయలతో ధర్నా చేస్తున్న విద్యార్థులు

హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టాలి

● కుళ్లిపోయిన కూరగాయలు, నాసిరకం సామగ్రితో వంట చేస్తున్నారని విద్యార్థుల రాస్తారోకో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో గల ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళనకు దిగారు. కుళ్లిన కూరగాయలు, సిలిండర్, వంట సామగ్రితో శుక్రవారం ఎన్టీఆర్ చౌరస్తా లో ఆందోళన నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమకు కుళ్లిపోయిన కూరగాయలు, నాసిరకం సామగ్రితో వంట చేస్తూ తమ ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాడని విద్యార్థులు రాస్తారోకో చేశారు. గత రెండేళ్లుగా ఇదే తంతూ కొనసాగుతుందని ఎంత చెప్పిన వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



అనురాధను ఆశీర్వదిస్తున్న దృశ్యం

అనాథ యువతి వివాహానికి చేయూత

● పుస్తెమట్టెలు, రూ.20వేలు అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 26: మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి వివాహానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన శామర్తి అనురాధకు తల్లిదండ్రులు మరణించారు. కాగా బంధువులు, గ్రామస్థుల సహకారంతో శుక్రవారం అనురాధకు వివాహం జరగగా పుస్తె మట్టెలతో పాటుగా రూ.20వేల నగదును భీంరెడ్డి అందజేశారు. అనంతరం నూతన దంపతులను ఆశీర్వదించి భోజనాలు చేశారు. ఈ మేరకు భీంరెడ్డికి నూతన వధూవరులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర



కొండగట్టుకు పాదయాత్రను ప్రారంభిస్తున్న స్వాములు

భిక్కనూరు , ఏప్రిల్ 26: మండలంలోని తిప్పాపూర్ గ్రామం నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టుకు హనుమాన్ స్వాములు శుక్రవారం పాద యాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని సన్నిధానంలో హనుమాన్ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు బాపురెడ్డి, రాజయ్య మాట్లాడుతూ మండలం రోజులు ఎంతోభక్తితో స్వామివారి మాలాధారణ పూర్తి చేసుకుని కొండగట్టులో మాలవిరమణకు పాదయాత్రగా తరలివెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



పుష్పగుచ్ఛంతో విద్యార్థిని అభినందిస్తున్న నోడల్ అధికారి

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 26: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కామారెడ్డి జిల్లా సాందీపని విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించినందుకు గాను జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అభినందించారు. జిల్లా విద్యార్థులు ఐఐటీ, జెఇఇ, నిట్ ప్రవేశ పరీక్షల్లో చాలా మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్లు జనార్దన్ రెడ్డి, పెంటయ్య, హరిస్మరణ్‌రెడ్డి, బాలాజీరావు, రాజేశ్వరరావు ఉపన్యాస బృందం తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో తనిఖీ చేస్తున్న టీయూ ఆడిట్ సెల్ అధికారులు

కనీస సౌకర్యాలు లేని కళాశాలల్లో తనిఖీలు

డిచ్‌పల్లి, ఏప్రిల్26: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ పీజీ, డిగ్రీ కళాశాలలుల్లో రెండోరోజూ తనిఖీలు చేసినట్లు వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్, గిరిరాజ్ కళా శాల, నలంద, గౌతమి, ఉమెన్స్, ఎస్వీ, కేర్, వాగ్దేవి, ప్రగతి, జునైరా, టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, కళాశాలల్లో రెంరోరోజు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. కళాశాలల్లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, అధ్యాపకు లు, సిబ్బంది వివరాలు, క్రీడా మైదానం, పార్కింగ్ సదుపాయాలు, మౌలిక సదుపాయాలపై పరిశీల న జరిపినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 3ప్రభుత్వ పీజీ కళాశాలలు, 16 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 54 ప్రైవేట్ యూజీ కళాశాలలు, 12 ప్రైవేట్ పీజీ కళాశాలలు, ఒకటి ఎంసీఏ కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. యూ జీసీ, ఉన్నత విద్యామండలి, విశ్వవిద్యాలయం నిర్దేశి ంచిన నియమ, నిబంధనలకు లోబడి తనిఖీలు నిర్వహిస్తున్నమన్నారు. తనిఖీల్లో తెలంగాణ విశ్వ విద్యాలయం ఆడిట్‌సెల్ అధికారులు జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ గోరీ, డీన్స్ రాంబాబు, అపర్ణ, ఆరతి, లావణ్య, మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

భిక్కనూరు, ఏప్రిల్ 26: మండలంలోని జంగంపల్లి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన పరుశురాములు జంగంపల్లి గ్రామం వద్ద గురువారం రాత్రి సమయంలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుకాల నుంచి ఢీకొనడంతో పరుశురాములుకు కాలు, చెయ్యి విరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసిన వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడు సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిట్లంలో చలివేంద్రం ప్రారంభం

పిట్లం, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభిచామని అధ్యక్షుడు రూప్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో తీవ్రమైన ఎండలు కొట్టడంతో ప్రజలకు తాగునీరు అందించాలని ఉద్దేశ్యంతో చలివేద్రం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, మల్లికార్జున్, రామకృష్ణ, నారాయణ, సంగమెశ్వర్,గణపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- మనజుమిల్ బాయ్స్
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	- గీతాంజలి
వెంకటేశ్వర	- రత్నం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

